క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపునకు సర్వే



కొలతలు వేస్తున్న సర్వేయర్

చెన్నూరు : స్థానిక పోలీసుస్టేషన్ వద్ద నుంచి పాత బస్టాండ్ వరకు ఆక్రమణల తొలగింపునకు మంగళవారం సర్వే అధికారి సోమశేఖర్, తహసీల్దార్ ప్రకాష్‌బాబుల ఆధ్వర్యంలో రికార్డుల ప్రకారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ మాట్లాడుతూ సర్వే పూర్తైన వెంటనే నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించి వారి ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు శివారెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, లత, వీఆర్వో శ్రీనివాసులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

నివాళి



మొయిళ్లకాల్వలో నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటసుబ్బారెడ్డి తండ్రి మల్లారెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు గంధోత్సవం

కడప కల్చరల్ : కడప పెద్దదర్గాలో బుధవారం ఖాజా యే ఖాజుగా నాయబే రసూల్ అత్తాయే రసూలుల్లా హజరత్ ఖాజా సయ్యద్ షా పీరుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుస్సేని చిస్టివుల్ ఖాద్రి సాహెబ్ గంధం ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి ఈ ఉత్సవం ప్రారంభం కానుందని దర్గా ప్రతినిధులు తెలిపారు. మొహర్రం నెల 10వ రోజు గురువులు జీవ సమాధి పొందిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో జరగనున్నాయి.

ఆంగ్ల విభాగంలో డాక్టరేట్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ పరిశోధకులు బండిసుల దస్తగిరికి వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ ఆంగ్ల విభాగం సహ ఆచార్యులు డాక్టర్ ఎన్ అంకన్న పర్యవేక్షణలో 'అరుంధతిరాయ్'స్ సెలెక్టెడ్ వర్క్స్ : ఏ స్టడీ' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. దస్తగిరి వీరపునాయనిపల్లె మండలం పాయసంపల్లె గ్రామానికి చెందినవారు.

నేడు 'మానస వీణ' పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన జీఎల్ లావణ్య రచించిన మానస వీణ పుస్తకాన్ని బుధవారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ, జమ్మలమడుగు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి.నారాయణరెడ్డి ఆవిష్కరించనున్నారని రచయిత్రి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సభకు కడప నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు.

ప్రబలుతున్న విషజ్వరాలు..



కమలాపురంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో ఇళ్ల మధ్యనే నిలిచిన మురుగు నీరు



కమలాపురం సొసైటీ కాలనీలోని మురికినీటిలో సంచరిస్తున్న పందులు

- వీధుల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కమలాపురం : వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, వీధులలో నిల్వ ఉన్న అపరిశుభ్రతతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. రోగులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిట కిట లాడుతున్నాయి. కమలాపురం సీహెచ్‌సీలో 100కి తగ్గకుండా రోగులు వస్తున్నారు. పెద్దచెప్పలి పీహెచ్‌సీలో 30 మందికి తగ్గకుండా రోగులు వస్తున్నారు. గత వారం రోజులుగా వాతావరణంలో మార్పు రావడం, గత నెల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టక పోవడం, ఎండ లేక పోవడం తదితర కారణాలతో మండల పరిధిలోని జంగంపల్లె, రామచంద్రాపురం, ఎర్రగుడిపాడు, నసంతపురం తదితర గ్రామాలలో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. దీంతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తుంటే అధిక శాతం మంది ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే రోజుకు కనీసం రూ.500 అవుతోందని, మూడు రోజుల పాటు వెళ్లాల్సి వస్తోందని, రూ.1500 వరకు ఖర్చు అవుతోందని రోగులు వాపోతున్నారు. వీధులలోని అపరిశుభ్రతపై సంబంధిత అధికారలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దచెప్పలిలో రోడ్డు పైనే నిలిచిన మురికినీరు



కమలాపురం సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న రోగులు



కమలాపురం పడమట వీధిలో చెత్త కుండి వద్ద నెలకొన్న అపరిశుభ్రత

వైరల్ ఫీవర్ వచ్చింది



వాతావరణంలో వచ్చిన మార్పులు, వీధులలో ఉండే అపరిశుభ్రతతో చలి జ్వరం వచ్చింది. భరించలేనంత ఒళ్లు నొప్పులు వచ్చాయి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాను. అక్కడ ఇంజక్షన్ వేసి మాత్రలు ఇచ్చారు. మూడు రోజుల పాటు రమ్మన్నారు. అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

-నరసింహులు, ఎర్రగుడిపాడు, కమలాపురం మండలం

కాచి చల్లార్చిన నీరు తాగాలి



వాతావరణంలోని మార్పుల కారణంగా విష జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీరు తాగాలి. తినే ఫుడ్ పై మూతలు పెట్టాలి. మల విసర్జన తర్వాత, భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. మోషన్స్ అయితే ఓఆర్ఎస్, జింక్ (జోడి నెంబర్.1) వాడాలి. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాం. ప్రజలు పైన చెప్పిన జాగ్రత్తలు పాటించి రోగాలు దూరం కావాలి.

- డాక్టర్ జ్ఞాన ప్రసూన, మెడికల్ ఆఫీసర్, పెద్దచెప్పలి పీహెచ్‌సీ, కమలాపురం మండలం

రోజు రోజుకు పెరుగుతున్న జ్వరపీడితులు

- ప్రైవేట్, ప్రభుత్వాసుపత్రులలో పెరిగిపోతున్న కేసులు

జమ్మలమడుగు : నియోజకవర్గంలో డయేరియాతో పాటు జ్వరం కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో డయేరియాతో ఎక్కువ బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూకట్టారు. దీంతోపాటు విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో జ్వరం, డయేరియా కేసులు నమోదు అవుతుండటంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధులలో ఎక్కడవేసిన చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో దోమలు ఎక్కువ అవటంతో జ్వరాల బారినపడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు దోమలవల్ల ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని 24 గంటల ప్రభుత్వాసుపత్రితో పాటు రెండు అర్బన్ హెల్త్ సెంటర్లలో, అలాగే మండల పరిధిలో మోరగుడి, పెద్దముడియం, మెడిదిన్నె, మైలవరం మండల కేంద్రంలోని వద్దిరాల గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులు పెరిగిపోతున్నారు. కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, ముద్దనూరు, ఎర్రగుంట్ల మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డయేరియా, జ్వరం కేసులు నమోదు అవుతున్నాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో డయేరియా, విషజ్వరాలకు కాలసిన మందులు గత ప్రభుత్వం ఇచ్చిన మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయని వైద్య సిబ్బంది తెలిపారు.

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం..

క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ర్యాలీలు చేసి డయేరియాని అరికట్టేవిధంగా తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాము. కేసులు ఉంటే వెంటనే వారిని అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా చికిత్సను అందిస్తున్నాము. కేసులు ఎక్కువగా ఉన్నట్లు అయితే ఆ ప్రాంతంలో మెడికల్ క్యాంపులు పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నాము.

- పి.శాంతికళ, డిప్యూటీ డీఎంహెచ్ఓ, జమ్మలమడుగు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

నేడు తొలి ఏకాదశి

పులివెందుల టౌన్ : నేడు తొలి ఏకాదశి కావడంతో స్థానిక శ్రీ పద్మావతి సమేత కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయం ముస్తాబైంది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వరదాచార్యులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామునుంచి భక్తులు ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తులు

పెద్దముడియం : కౌలు రైతు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణ తెలిపారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ భూ యజమాని నుంచి కౌలు అగ్రిమెంట్ తీసుకున్న రైతులు దరఖాస్తులను రైతు భరోసా కేంద్రాలలో అందజేయాలన్నారు. భూ యజమాని పాస్ పుస్తకం, కౌలు రైతు బ్యాంక్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, ఫొటోలను దరఖాస్తుకు జత చేయాలన్నారు. గత ఏడాది మండలంలో 305 మందికి కౌలు రైతు గుర్తింపు కార్డులు జారీ చేశామని తెలిపారు. వీరు వ్యవసాయం చేస్తుంటే కార్డులను రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ఏటా 11 నెలల కాల వ్యవధితో గుర్తింపు కార్డుల జారీ ఉంటుందన్నారు. ప్రభుత్వం యజమానుల భూమి హక్కులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలపై మాత్రమే కౌలుదారునికి హక్కు ఉండేలా కౌలు రైతు చట్టాన్ని రూపొందించిందన్నారు. గుర్తింపు కార్డులున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ సహాయం అందుతుందన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పులివెందుల రూరల్ : మండలానికి సంబంధించి గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. సమావేశంలో పులివెందుల మండలంలో నెలకొన్న సమస్యలపైన, అభివృద్ధిపైన చర్చిస్తారన్నారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. హాజరు కాని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కొండాపురం : నంద్యాల జిల్లాలోని ముచ్చుమర్రిలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందుతులను కఠినంగా శిక్షించాలని అభ్యుదయ మానవ హక్కుల జాతీయ అధ్యక్షురాలు రామాంజనమ్మ, ఏపీ గిరిజన జిల్లా మహిళా అధ్యక్షురాలు దేరా జ్యోతిలు మంగళవారం డిమాండ్ చేశారు. 9 ఏళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి నీళ్లలో వేసిన మానవ మృగాలను ఉరి తీయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆరు గ్యారంటీల పథకాలపై బాబు మీనమేషాలు

జమ్మలమడుగు : టీడీపీ ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారంటీలలో ఉన్న తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీపై చంద్రబాబునాయుడు మీనమేశాలు లెక్కిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధికారంలోనికి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నారో అంత మందికి తల్లికి వందనం పథకం అమలు అవుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జీవో తీసుకువచ్చి అందులో ఒక తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామని సూచించింది. ప్రజలనుంచి వ్యతిరేకత వస్తుండటంతో తాము దీనిపై చర్చిస్తున్నామనడం ప్రజలను నమ్మించి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మరో ఆరునెలలో చంద్రబాబునాయుడు నిజస్వరూపం ప్రజలు తెలుసుకుంటారన్నారు. కార్యకర్తలు భయపడవలసిన అవసరంలేదని అందరికి తాను అందుబాటులో ఉంటానన్నారు. తిరిగి మనకందరికి మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వర రెడ్డి, మార్బల్ శ్రీను, షామీర్‌ఆలీ, హృషికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

గర్భిణులకు ఉచిత స్కానింగ్ పరీక్షలు

లింగాల : పులివెందుల పట్టణానికి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ శరణ్య ఆధ్వర్యంలో మంగళవారం లింగాల పీహెచ్‌సీలో హైరిస్క్ గర్భిణులకు ఉచిత స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా గర్భంలోని పిండం పెరుగుదల, ఆరోగ్య స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. ఈ ప్రక్రియ ప్రతి నెల 9, 10 తేదీలలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ ద్వారా నిర్వహిస్తామన్నారు. పులివెందుల డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజామొయిద్దీన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణ్ దినకర్, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించండి

కడప ఎడ్యుకేషన్: ద్విచక్ర వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి ప్రమాణం చేయాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శాంత పేర్కొన్నారు. కడప జేఎంజే జూనియర్ కళాశాలలో మంగళవారం ద్విచక్ర వాహన వినియోగదారులు రక్షిత హెల్మెట్ ఉపయోగించడంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా సురక్షితంగా గమ్యాన్ని చేరాలంటే ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారుడు తమ ప్రాణాలనే కాకుండా కుటుంబ సంక్షేమాన్ని కూడా గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఖచ్చితంగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. విద్యార్థులు ప్రమాదాల్లో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని హెల్మెట్‌ను వాడాలన్నారు. అనంతరం గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో జేఎంజే జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రోసిరాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను ఖండిస్తున్నాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దళిత వర్గాలపై అగ్రవర్ణాల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు గుడిసె దేవానంద్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో దేవానంద్ మాట్లాడారు. ఒంటిమిట్ట మండలంలో కదిరి ప్రభాకర్ అనే దళితుడు సేద తీరేందుకు అరుగుపై కూర్చొంటే కాగుతున్న నూనె తీసుకొచ్చి వేయడం దారుణమన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి సహకరించండి

పెండ్లిమర్రి : మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో మంగళవారం ఎంపీపీ మాచునూరు వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఏఓ అల్తాఫ్ హుస్సేన్, పీఆర్ ఏఈ సుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ

విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెండింగ్ పెట్టొద్దు

చక్రాయపేట : విద్యార్థులకు సంబంధించి స్కాలర్‌షిప్‌లు పెండింగ్ లేకుండా చూడాలని కడప సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సరస్వతి తెలిపారు. మంగళవారం ఆమె చక్రాయపేటలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మండలంలోని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశం మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే స్కాలర్‌షిప్‌లు సక్రమంగా అందించేలా చూడాలన్నారు. అనంతరం ఆమె గత ప్రభుత్వం రూ.2.22 కోట్లపాడా నిధులతో నూతనంగా నిర్మించిన వసతి గృహ భవనాన్ని పరిశీలించారు. నిధులు మంజూరు చేయించుకుని భవన నిర్మాణం పూర్తయ్యేందుకు కృషి చేసిన హాస్టల్ సంక్షేమ అధికారి కేశవులును ఆమె అభినందించారు. అనంతరం హాస్టల్ ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ఏఎస్‌డబ్ల్యూవోలు, వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కడప సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సరస్వతి

ఘనంగా గూగూడు కుళ్లాయిస్వామి పీర్ల ఉత్సవం



పార్నపల్లె రోడ్డులో గూగూడు కుళ్లాయిస్వామి పీర్ల ఉత్సవం



సింహాద్రిపురం : చావిడిలో కొలువుదీరిన పీర్లు



సింహాద్రిపురం : మేళతాళాలతో పానకాలను తీసుకెళ్తున్న భక్తులు



కె.అప్పాయపల్లెలో ఊరేగుతున్న పీర్లు



లింగాలలో జూలూబాకర్ స్వామి పీరును ఊరేగిస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్ : స్థానిక నగరిగుట్టలోని గూగూడు కుళ్లాయిస్వామి పీరు ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో గూగూడు కుళ్లాయిస్వామి పీర్ల ఉత్సవం మొదటిగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పీర్ల చావిడిలో పీర్లను కొలువుతీర్చి ముస్తాబు చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో పీర్లను ఎత్తుకుని అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం అక్కడి నుండి నగరిగుట్ట, గోపీవిహార్ వీధి, పార్నపల్లె రోడ్డు, బైపాస్ రోడ్డు, మెయిన్ బజార్ మీదుగా డప్పు వాయిద్యాల నడుమ పీర్ల ఉత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ పెద్దలు పీర్ల గ్రామోత్సవంలో పాల్గొని భక్తులకు ప్రసాదాలను అందజేశారు. భక్తులు తమ ఇంటివద్దకు రాగానే వెండి గొడుగులను చేయించి పీర్లకు అలంకరించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం చెక్కర చదింపులు చదివించారు.

ఘనంగా మొహరం వేడుకలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని ఎర్రబల్లె పంచాయతీ నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో కొత్తపల్లె గ్రామానికి చెందిన పీర్లను ఊరేగింపుగా నల్లపురెడ్డిపల్లె గ్రామానికి తీసుకురావడం ఆనవాయితీ. అలాగే నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని పీర్లను కొత్తపల్లె గ్రామానికి బాణాసంచాలు పేల్చుకుంటూ డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు. రెండు గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. గ్రామాల్లో తీసిన గుండం మూడు రోజులు వెలిగేవిధంగా మంటలు వేస్తారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని గ్రామాల్లో మంగళవారం ఘనంగా పెద్ద సెరగెత్ వేడుకలను భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. పానకాలను పీర్ల చావిడి వద్దకు మేళతాళాలతో తీసుకెళ్లి ఫాతిహాలు నిర్వహించి అనంతరం పంపిణీ చేశారు. రాత్రి అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు.

లింగాలలో..

లింగాల : మండల కేంద్రంలో మంగళవారం జూలుబాకర్ స్వామి పీరును ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. కొమ్మద్ది వంశీకులు పీర్ల చావిడి నుంచి జూలుబాకర్‌స్వామి పీరును తీసుకువెళ్లి వారి ఇళ్లవద్ద పీరును ముస్తాబు చేసి ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోంది. డప్పులు, మేళాలతో డీజే పాటలతో యువకులు చిందులు వేస్తూ వారి ఇళ్ల వద్ద నుంచి పీర్ల చావిడికి జూలుబాకర్ స్వామిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. గ్రామంలో ప్రజలు స్వామి వారిని దర్శించుకుని చెక్కర చదివింపులు చదివించారు.

భక్తి శ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

కమలాపురం : పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లె, సి.గోపులాపురం గ్రామాలలో మొహర్రం పండుగను పురస్కరించుకుని మంగళవారం తెల్లవారు జామున పీర్లను భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. దాదాపు వారం రోజుల క్రితం పట్టణంలోని కుళాయిస్వామి దర్గా, బీడీ కాలనీ, అప్పాయపల్లె, సి.గోపులాపురం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, విభరాపురం తదితర గ్రామాలలో వెలసిన పీర్ల మకాన్లు, దర్గాలలో పీర్లు కొలువు దీరారు. మొహర్రం పండుగను పురస్కరించుకుని ఇమాం హసేన్, హుసేన్‌తో పాటు పలు పీర్లను గ్రామాల్లో వైభవంగా ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు. అప్పాయపల్లె, సి.గోపులాపురం గ్రామాల్లో మంగళవారం తెల్లవారు జామున పీర్లను వైభవంగా ఊరేగించారు. సి.గోపులాపురంలో దాతలైన ఎస్‌కే బాషా, రమణారెడ్డి, బాబా ఫకృద్దీన్ సహకారంతో ఊరేగింపు అనంతరం అన్నదానం నిర్వహించారు. విభరాపురం, కమలాపురం తదితర గ్రామాలలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జామున వరకు పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిందు ముస్లింలు కలసి చేసుకునే పండుగల్లో మొహర్రం ఒకటి. సమీప గ్రామాలకు చెందిన ప్రజలు పీర్ల చావిడి, దర్గాల వద్దకు చేరుకుని పీర్లను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. చెక్కెర పంచి పెట్టారు.